

టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం క్రీడాకారులతో కలిసి జాతీయ గీతం ఆలపిస్తున్న మధుసూదన్‌రెడ్డి

యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

● గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ వద్ద స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టీం స్పాన్సర్స్, నిర్వాహకులు పాల్గొన్నారు.



వినాయకహిల్స్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దీపికాశేఖర్‌రెడ్డి

సబితారెడ్డి చొరవతోనే తాగునీటి సమస్య దూరం

● అల్మాస్‌గూడ కార్పొరేటర్ దీపికారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడ 5వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే సబితారెడ్డిదేనని స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె ఇక్కడి వినాయకహిల్స్‌తో పాటు పలు కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, ఎమ్మెల్యే చొరవతో ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతున్నదని ఆమె అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



రామయ్య ధనుస్సుకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

మీర్‌పేట్ చేరిన అయోధ్య రామయ్య ధనుస్సు

సరూర్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : అయోధ్య రామయ్య కోసం చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు 13కిలోల వెండి, ఒక కిలో బంగారంతో(మొత్తం 14కిలోలు) తయారు చేయించిన ప్రత్యేక ధనుస్సు శనివారం రాత్రి మీర్‌పేట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఇక్కడి శివసాయినగర్‌లోని శ్రీగౌరీ నీలకంఠేశ్వర సమేత లక్ష్మీగణపతి ఆలయంలో ధనుస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర కాలనీలకు చెందిన భక్తులు ధనుస్సును దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్ రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, బాపిరాజు, వెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీగణపతిరావు పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ ఆలయంలో గోదా అమ్మవారికి అభిషేకం

ఎల్బీనగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా ఆదివారం ఆర్‌కేపురం వాసవీకాలనీలో అష్టలక్ష్మీ ఆలయంలో గోదా అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మరిగంటి లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి అభిషేకం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయితా అంజయ్య, మాజీ చైర్మన్ బంధం దామోదర్‌గుప్తా, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోదా అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ముగిసిన ఉర్సు ఉత్సవాలు

వనస్థలిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని హజ్రత్ ఇమామ్ అలీషా దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ముగింపు వేడుకలకు వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నలు హాజరై దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే రియాజ్, నాయకులు అఖిలేష్, జావేద్, జాఫర్, భాషా, సాదిక్ పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, శ్రీనివాస్‌గుప్తా

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

మన్సూరాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : 63ఏళ్ల క్రితం స్థాపితమైన వాసవీ క్లబ్ దేశ స్థాయిలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని పప్పయిగూడ చౌరస్తా వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు చీరల పంపిణీని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బొగ్గారపు దయానంద్, ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఏర్పాటు నుంచి రక్తదాన శిబిరాలు, మెగా హెల్త్ క్యాంపులు, పుస్తకాల పంపిణీ, చీరల పంపిణీ చేస్తూ నిరుపేదల కుటుంబాలు, విద్యార్థుల అవసరాలను తీర్చడం పట్ల నిర్వాహకులను అభినందించారు. వీసీహెచ్ అధ్యక్షుడు పొద్దటూరి రాజేశ్వర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, యాదిరెడ్డి, అధ్యక్షుడు దయాకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభ, కోశాధికారి ప్రదీప్‌కుమార్, కన్వీనర్ మధు, చైర్మన్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

గాయపడిన ఎస్సీ మోర్చా నేతకు పరామర్శ

సైదాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి ఘటనలో గాయపడిన ఎస్సీ మోర్చా ఆఫీస్ ఇన్‌చార్జి నందురాజ్ బహదుర్‌పురాలోని నివాసంలో భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు పరామర్శించారు. కార్యక్రమంలో యాఖత్‌పురా అసెంబ్లీ ఎస్సీ మోర్చా కన్వీనర్ మోహనకృష్ణ, సెన్సార్ బోర్డు మెంబర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌నగర్‌చౌరస్తాలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్



స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ఎస్‌బీహెచ్ బీ కాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి



ప్రెస్ కాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

స్వామి వివేకానందకు ఘన నివాళి

జోన్‌బృందం : స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా ఆదివారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జాతీయ యువజన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వివేకానందుడి విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భారతీయ తాత్విక చింతనను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని వక్తలు కొనియాడారు. స్వామి వివేకానందుడి బోధనలు నేటి సమాజానికి ఆచరణీయమని, ఆయన స్ఫూర్తితో యువత తమ గమ్య స్థానాలను చేరేదాక విశ్రమించరాదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. జిల్లెలగూడలోని లలితానగర్ చౌరస్తాలో కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ కుమార్‌యాదవ్, లార్డ్ బీరప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మేయర్ దుర్గాదీప్‌లాల్ పాల్గొని వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించారు. కార్పొరేటర్లు రాజేందర్‌రెడ్డి, ధనలక్ష్మీరాజ్‌కుమార్, లావణ్యబీరప్ప పాల్గొన్నారు. సహారా ఎస్టేట్స్ వద్ద వివేకానందుడి వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, కార్పొరేటర్లు, వివిధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లెలగూడలో వివేకానందుడి జయంతి వేడుకల్లో పాల్గొన్న మేయర్ దుర్గాదీప్‌లాల్, కార్పొరేటర్లు



కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి



సహారా ఎస్టేట్స్ వద్ద నివాళులర్పిస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు



ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు



మలక్‌పేట నల్గొండచౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు హరిగౌడ్, రాంకోటేశ్వర్‌రావు, చౌకి రాజు

అర్హులందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతుభరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరిగేలా చూడాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఆయా పథకాలను ఈ నెల 26వ తేదీ నుంచి అమలులోకి తీసుకురానున్న నేపథ్యంలో ఈనెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సదరు పథకాల విధివిధానాలు, అమలుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించే నిమిత్తం ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ రైతుభరోసా కింద ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.12వేలు అందజేయనున్నదని, వ్యవసాయ యోగ్యమైన భూములకే ఈ పథకం వర్తిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారుల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లు లేని అసలైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నందున వారి ఎంపికలోనూ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు అందేలా చూడాలని ఆమె సూచించారు. పది రోజుల పాటు డివిజన్లలో నిర్వహించబోయే సభల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ జ్యోతీరెడ్డి, మేనేజర్ నాగేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మేయర్ పారిజాతారెడ్డి, కమిషనర్ సరస్వతి

పర్యావరణ పరిరక్షణతోనే మానవ జాతి మనుగడ

● మలక్‌పేట ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని, అప్పుడే మానవజాతి మనుగడ సాధిస్తుందన్న వాస్తవాన్ని గుర్తించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం మలక్‌పేట గోల్నాకా బ్రిడ్జి వద్ద గ్రీన్‌ఎర్త్ ప్రాజెక్టులో భాగంగా అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఏఎస్ఈజెడ్ డబ్ల్యూఏవో ఆధ్వర్యంలో మూసీ ఒడ్డున పారిశుధ్య పనుల నిర్వహణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయడాన్ని నివారించాలన్నారు. పరిసరాల అపరిశుభ్రతతోనే పలు రకాల రోగాలు, ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. వాటి నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఒక బాధ్యతగా గుర్తించాలన్నారు. సంస్థ హైదరాబాద్ సౌత్ ఇన్‌చార్జి ఎం.జెస్సీ మాట్లాడుతూ ఏఎస్ఈజెడ్ డబ్ల్యూఏవో స్వచ్ఛంద సంస్థకు చెందిన 200 మంది వలంటీర్లు తమ విధి నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెలవు రోజుల్లో పర్యావరణ పరిరక్షణ కోసం పారిశుధ్య నివారణలో భాగస్వాములవుతున్నారన్నారు. మూసీ పరిసరాల్లోని చెత్తను తమ సంస్థ వలంటీర్లు స్వచ్ఛందంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దీని ద్వారా స్థానికులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఏఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, సానిటేషన్ సూపర్వైజర్ గోవింద్‌రెడ్డి, రాంకీ జోనల్ ఇన్‌చార్జి రాజ్‌కరణ్, సర్కిల్ ఇన్‌చార్జి దినేష్, ఎంఐఎం నాయకులు సైఫుద్దీన్‌షఫీ, వార్డు కమిటీ సభ్యుడు వాసు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, పక్కన స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ సౌత్ ఇన్‌చార్జి జెస్సీ, ఏఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ఎస్ఎస్ గోవింద్‌రెడ్డి

కనులపండువగా కరణ్‌బాగ్ మల్లన్న కల్యాణోత్సవం

సైదాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : భాగ్యనగరంలోనే ప్రసిద్ధిగాంచిన 400 సంవత్సరాల పురాతనమైన సైదాబాద్ కరణ్‌బాగ్‌లోని మల్లికార్జునస్వామి ఆలయ మల్లన్నస్వామి కల్యాణోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. మల్లన్న శరణు శరణు అంటూ జయజయ ధ్వనులతో పరిసరాలు మార్మోగిపోయాయి. ఈ ఉత్సవాలకు ఆలయాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో బలిజమేడదేవి, గొల్ల కేతమ్మ సమేత మల్లన్నస్వామి కల్యాణం ఘనంగా జరిగించే ఉత్సవాలను తిలకించేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వీఎస్‌వీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మడిగల లక్ష్మారెడ్డి, శివయాదవ్, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఒగ్గు పూజారులు

బీజేపీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడిగా నవీన్‌కుమార్

● జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా సుమన్‌గౌడ్

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడిగా గంగబోయిన నవీన్‌కుమార్‌యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా బత్తుల సుమన్‌గౌడ్‌లు నియామకమయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్‌లో బీజేపీ పటిష్టానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించిన జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రారపు శంకర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



నవీన్‌కుమార్‌యాదవ్



సుమన్‌గౌడ్

అక్రమ అరెస్టులతో ఆందోళనలను అడ్డుకోవడం సిగ్గుచేటు

● బీఆర్ఎస్ అధ్యక్షులు రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి ధ్వజం

సరూర్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేస్తున్న దాడులకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను అక్రమ అరెస్టులతో అడ్డుకోవాలని చూడడం సిగ్గుచేటని బీఆర్ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల శాఖల అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆందోళనలకు దిగనున్నట్టు సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు ఆదివారం ఉదయం స్థానిక నేతలను ముందస్తు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా పీఎస్‌లో వారు ఆందోళన నిర్వహించారు. అనంతరం రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పక్కన బెట్టి, ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలనుకోవడం అవివేకమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భీమిడి జంగారెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామన్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షులు రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి తదితరులు



ఆర్టీఏ జిల్లా మెంబర్‌గా నియమితులైన కృష్ణగౌడ్‌కు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఆర్టీఏ జిల్లా మెంబర్‌గా కృష్ణగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రాంతీయ రవాణా అథారిటీ రంగారెడ్డి జిల్లా సభ్యుడిగా పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుయ్య కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం కృష్ణగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి ఎప్పటికైనా పదవులు దక్కుతాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కృష్ణగౌడ్ మాట్లాడుతూ రహదారి భద్రతతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానన్నారు. ఆర్టీఏ మెంబర్‌గా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం, ఎమ్మెల్యే మల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, రాజేందర్, నాయకులు రాజు, విజయేందర్‌రెడ్డి, చిరంజీవి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



డప్పులతో ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సుధాకర్‌మాదిగ

స్వార్థ ప్రయోజనాలతో ఎస్సీ వర్గీకరణకు అడ్డు

మన్సూరాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పాటు తెలుగు నేలపై మంద కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలంటూ నిస్వార్థంగా పోరాడుతుంటే కొందరు స్వార్థ ప్రయోజనాలతో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్‌మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకై మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఆదివారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద 'వెయ్యి గొంతుకలు-లక్షడప్పుల మహాప్రదర్శన'ను నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తిన సుధాకర్ మాదిగ మాట్లాడుతూ ఎంత మంది అడ్డుపడినా మంద కృష్ణమాదిగ నాయకత్వంలో 59 కులాల జనాభా దామాషా ప్రకారం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ కార్యదర్శి ప్రకాశ్‌మాదిగ, నాయకులు శేఖర్, రాజు, లింగం, పరశురాములు, పుల్లయ్య, మౌలాలి, లోకయ్య, రంగయ్య పాల్గొన్నారు.

గ్యాస్ లీక్‌తో అగ్ని ప్రమాదం

● మంటల్లో కాలిపోయిన వంట సామగ్రి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో వంట గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వంట సామగ్రితో పాటు సుమారు రూ.20వేల ఆస్తినష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్ పాత రోడ్డులోని ఓ రేకుల ఇంట్లో కాశమోని రాంచందర్ దంపతులు అద్దెకు ఉంటున్నారు. ఆదివారం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలను గమనించిన రాంచందర్ గదిలో నుంచి బయటకు వచ్చి స్థానికుల సహాయంతో హయత్‌నగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. క్షణాల్లో అక్కడికి చేరుకున్న ఫైర్ ఆఫీసర్ యాదగిరి సిబ్బందితో కలిసి మంటలను ఆర్పేశారు. అప్పటికే వంట సామగ్రితో పాటు రూ.20వేల ఆస్తినష్టం జరిగినట్లు తెలిసింది. ఫైర్ ఇంజన్ ఏమాత్రం ఆలస్యమైనా మరింత ఆస్తినష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్‌లు ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు

బండి మీద దింపుతానని నమ్మించి..
వృద్ధురాలి గొలుసు లాక్కెళ్లిన దొంగ

దుండిగల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రికి వచ్చి వెళుతున్న వృద్ధురాలికి మాయమాటలు చెప్పిన దొంగ పట్టపగలే ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కెళ్లాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బౌరంపేట గ్రామానికి చెందిన చింతకింది శంకరమ్మ (65) బౌరంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ఓ దొంగ మాటలు కలిపి, బండిపైన ఇంటి వద్ద దింపుతానని నమ్మించాడు. కొంత దూరం తీసుకువెళ్లి మెడలో ఉన్న ఐదు తులాల బంగారపు పుస్తెల తాడును లాక్కెళ్లాడు. దీంతో శంకరమ్మ కుటుంబ సభ్యులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు.